
# అడుగో- ఆదిమానవుడు



**అ**ర్ధరాత్రి- పన్నెండు గంటలకు కాబోలు! చాలా పెద్ద కోలాహలం వినిపించింది కాలనీకి దగ్గరగా.

నాకు శాయిరామ్‌మీద వళ్ళు మండిపోయింది. మళ్ళీ ఏదో కొంపలమీదకు తెచ్చి మీటింగ్ ఏర్పాటు చేశాడేమోనని.

వచ్చే ఎలక్షన్లలో శాయిరామ్‌కి ఎలాంటి ఆఫీస్‌బేరర్ పోస్టు దక్కకుండా చూడాలని అప్పటికప్పుడే నిర్ణయించుకున్నాను.

ఈలోగానే తలుపులు దబదబ బాదటం మొదలు పెట్టారు బయటినుంచీ. తలుపు తెరిచేసరికి ఎదురుగ్గా శాయిరాం, రంగారెడ్డి, జనార్ధన్, యాదగిరి, గోపాల్రావ్, పార్వతీదేవి, రాజేశ్వరి, వెంకట్రావ్, చంద్రకాంత్ అందరూ నిలబడి ఉన్నారు.

"ఏమిటి?" కోపంగా అడిగాను శాయిరామ్‌ని.

"బయటకు పద! అక్కడెవరో చాలామంది జనం వచ్చారు-" అన్నాడు రంగారెడ్డి.

"ఎవరు వాళ్ళు?"

"అదే తెలీదు! నాలుగు లారీల్లో తీసుకొచ్చి వాళ్ళనక్కడ దింపి వెళ్ళిపోయారట ఎవరో–" నాకు అర్ధమయిపోయింది.

హైద్రాబాద్‌లో ఇలాంటి దృశ్యాలు కొత్తేమీ కాదు. ఎమ్మెల్యేలు, గూండాలూ సాధారణంగా అర్ధరాత్రుళ్ళే వాళ్ళమనుషులను తీసుకొచ్చి గవర్నమెంటుదో, ప్రైవేటుదో మాంచి ఖాళీస్థలం చూసి తెల్లారేసరికల్లా గుడిశెలు వేయించేసి కాపురాలు పెట్టించేస్తారు. ఆ కాలనీకి ఇందిరా హట్స్ కాలనీ అనిగానీ, సంజయ్‌నగర్ కాలనీ అనిగానీ బోర్డుపెట్టేస్తారు.

ఈ మధ్య అదేటైప్‌లో ఎన్టీఆర్ నగర్‌లు కూడా వెలిశాయ్!

"బహుశా ఇక్కడ కూడా ఎన్టీఆర్ హట్స్‌కాలనీ అని పెడతారేమో–" అన్నాన్నేను.

"అసలు సంగతేమిటో కనుక్కుందాం పదండి" అన్నాడు శాయిరామ్. అందరం వాళ్ళదగ్గర కెళ్ళాము.

తీరా వాళ్ళదగ్గరకెళ్ళేసరికి మాకు భయంవేసింది, వాళ్ళ ఆకారాలు చూసి. నల్లగా, లావుగా, పొడుగ్గా, కేవలం నడుము చుట్టూ ఆకులతో అల్లినచాప ధరించి ఉన్నారు.

మమ్మల్ని చూడగానే కొంచెం భయపడినట్లున్నారు. నాలుగడుగులు వెనక్కువేసి గుంపుగా నిలబడ్డారు అందులో ఒకరిద్దరు ఈటెల్లాంటివి చేతుల్లోకి తీసుకున్నారు కూడా.

మాకు ఖంగారు పుట్టింది– మమ్మల్ని చావబాదుతారేమోనని. ఎందుకయినా మంచిదని మేమూ రెండడుగులు వెనక్కివేశాము.

"మీరెవరు?" అడిగాడు శాయిరాం.

వాళ్ళు మావేపు అయోమయంగా చూశారు.

"కలోతసబీనమా కసనమ" అన్నాడు వాళ్ళమధ్యలో నిలబడ్డ లావుపాటివాడు. వాడినెత్తిన చిన్న శంఖువు ఒకటి కిరీటంలా నిలబడి ఉంది.

వాళ్ళు మాట్లాడేది సరికొత్తభాష అని అర్థమయింది నాకు.

"ఇదేదో సరికొత్త భాష! లాగుంది. అసలే పద్దెనిమిది భాషలతో మనదేశం నానా ఛావు ఛస్తూంటే మళ్ళీ ఇప్పుడింకోటా?" విసుక్కున్నాడు రంగారెడ్డి.

"ఇంతకూ వీళ్ళ విషయాలు ఎలా తెలుసుకోవడం?" అందరం ఆలోచనలో పడ్డాం.

"పోనీ మన తెలుగు వీళ్ళ కర్థమవుతుందేమో చూద్దాం–" అన్నాడు యాదగిరి.

"ఏడ్చినట్లుంది మన తెలుగు ఒక ప్రాంతంది ఇంకో ప్రాంతంలోనే అర్థమయి చావదు– ఇంక బయటాడికేం అర్థమవుతుంది?" విసుక్కున్నాడు రంగారెడ్డి.

"ఇంకోపని చేద్దాం! మన కాలనీలో రాజానందం ఉన్నాడు గదా! అతనిని పిల్చుకొద్దాం" అన్నాడు శాయిరామ్. ఆ అయిడియా అద్భుతంగా ఉందని అందరం అతన్ని మెచ్చుకున్నాం.

రాజానందానికి పదహారు భాషలు వచ్చున్న విషయం కాలనీలో అందరికీ తెలుసు. వెంటనే యాదగిరి వెళ్ళి రాజానందాన్ని సైకిల్ మీద తీసుకొచ్చేశాడు.

"హలో హౌ ఆర్ యూ?

కై సేహెూ?

బాగున్నావా?

నల్ల ఇరుకా?"

అంటూ అన్ని భాషల్లో మాట్లాడబోయాడు గాని మధ్యలో కట్‌చేసేశాము టైంలేదని.

"ముందు వాళ్ళతో ఒకటిరెండు భాషల్లో మాట్లాడు– వీళ్ళ భాష మాకు తెలిచ్చావటం లేదు" అన్నాడు రంగారెడ్డి. అతను వెంటనే వాళ్ళదగ్గరకు నడిచాడు.

"ఎవరు మీరు" అనడిగాడు ముందు. తరువాత మరో అయిదారు భాషల్లో అడిగాడు. ఆఖరికి "గిబసీబసాతామ" అన్న భాషకు వాళ్ళు సమాధానం చెప్పారు.

"గదసీ మసజకా– బిక్షాద్వీప్" అన్నాడు వాళ్ళనాయకుడు.

"నేను అనుక్నుది కరెక్టే! వీళ్ళది భిక్షాదీప్ అని ఒక ద్వీపం! అక్కడ నుంచి వచ్చారుట!" అన్నాడు రాజానందం మావేపు తిరిగి.

"భిక్షాద్వీపం అంటే ఎక్కుడుంది?"

"లక్షాద్వీప్ పక్కనే! చాలా చిన్నద్వీపం–"

అంటూ వాళ్ళతో మరో పదినిమిషాలు మాట్లాడాడు– వాళ్ళ భిక్షాద్వీప్ భాషలో.

వాళ్ళసంభాషణలో మాకు లభించిన వివరాలేమిటంటే– ఎవరో ఓ కేంద్రమంత్రి భిక్షాద్వీప్ పర్యాటన కెళ్ళాడట. అక్కడున్న ఈ భిక్షాద్వీప్ ప్రజలు ఇంకా ఆదిమానవుల దశలోనే ఉండటం గ్రహించి వెంటనే వారందరినీ నాగరీకులుగా చేయటానికి భారతదేశంలోని అయిదారు పట్టణాలల్లో పునరావాసం కల్పించాలని నిర్ణయించి ఇండియాకు తీసుకొచ్చారట. వాళ్ళల్లో ఒక జాతిని మా కాలనీ పక్కగా ఉన్న ప్రభుత్వస్థలంలో వదిలి ఇళ్ళు కట్టుకోటానికి మెటీరియల్ సమకూర్చారు. ఆ మాట వినటంతో మా కాలనీలోని లేడీస్ అందరికీ ఉత్సాహం పుట్టుకొచ్చింది.

"పాపం! వీళ్ళను మనందరం కలసి నాగరికలుగా చేద్దామండి" అంది పార్వతీదేవి.

"అవును! మన ఆడాళ్ళకెలాగూ మధ్యాహ్నంపూట పనీపాట ఉండదు. కనుక తీరిక సమయాల్లో వీరికన్నీ నేర్చవచ్చు–" అన్నాడు శాయిరామ్ కూడా.

ఆ విషయమే రాజానందంతో వాళ్ళకు చెప్పించాము. మర్నాడు పొద్దున్నే మళ్ళీ వాళ్ళను కలుసుకుంటామని చెప్పి వచ్చేశాం.

ఆ రోజు ఉదయం ఆదివారం కావడం వల్ల తీరిగ్గా కాఫీ ఫలహారాలు ముగించి ఆడా మగా, పిల్లలూ అందరం భిక్షాద్వీప్ ఆదిమానవుల దగ్గరకు చేరుకున్నాం.

అప్పటికే వారు కొండరాళ్ళతో కొండ గుహల్లాగా ఇళ్ళుకడుతున్నారు. మాకు జాలివేసింది వారిని చూస్తూంటే.

"పిచ్చి వాళ్ళులారా! చీకిటి గుమారాల్లంటి కొండ గుహల్లో ఉండటం తప్పు. ఆధునిక మానవుడి ఇల్లు చూపిస్తారండి!" అంటూ నచ్చచెప్పాడు రాజానందం వాళ్ళకు.

అందరం శాయిరాం వాళ్ళింటికెళ్ళాం. కానీ పవర్‌కట్ ఉండడంతో ఇల్లంతా పరమ చీకటిగా ఉంది ఎక్కడే వస్తువుందో కనబడటం లేదు. అదీగాక లోపలివంటిల్లూ, పడగ్గదీ అసలు ఒక్క కిటికీ కూడా లేకపోవటం వల్ల– మరింత గాఢంధకారంగా ఉన్నాయ్. అతనిదే కాదు మా కాలనీలో అందరిళ్ళూ అలాగే ఉంటాయ్. వాటిని 'కబోలా' అనే ఓ మతానికి చెందిన ప్రభుత్వ ఇంజనీర్ డిజైన్ చేశాడు. వాళ్ళ మతాచారాల ప్రకారం ఇంటి ఆడాళ్ళ మీదరకు ఎలాంటి వెల్తురూ. ప్రసరించకూడదట. బ్రతికున్నన్నాళ్ళూ వాళ్ళు ఆ ఇంటి గడపదాటి బయటకు రాకూడదు. వాళ్ళు చనిపోయినప్పుడు కూడా వంటింట్లోనే తవ్విపాతి పెట్టేస్తారట.

కనుక ఆ కబోలా ఇంజినీరుగారున్నంతకాలం వాళ్ళకోసం ఆంధ్రప్రదేశ్‌లో అలాంటి కాలనీలే నిర్మించింది ప్రభుత్వం.

"ఇల్లంటే ఇలా ఉండాలి. గాలి వెల్తూరూ ధారళంగా రావాలి" అన్నాడు శాయిరామ్. ఆ చీకటిలో పక్కకు నడవబోయి ఏదో పీటతగిలి కిందపడి త్వరత్వరగా లేచినిల్చుంటూ.

ఆదిమానవులందరూ మొఖాలు చూసుకున్నారు.

"కాని ఇదీ మా కొండగుహల్లాగానే చీకటిగా ఉంది కదా!" అడిగాడు వాళ్ళ నాయకుడు. (రాజానందం ప్రకారం). మాకేం జవాబు చెప్పాలో తెలీలేదు.

"కొంచెం అలాగే ఉందనుకో– కానీ ఈ కాలనీ వదిలేస్తే మిగతా ప్రైవేటు ఇళ్ళు చాలా బాగుంటాయ్–" అంటూ గొణిగాడు రంగారెడ్డి.

వాళ్ళు మా ఎక్స్‌ప్లనేషన్‌తో సంతృప్తిపడలేదు.

అందరం కాలనీ మధ్య శాయిరామ్ ఏర్పాటు చేసిన వేదిక దగ్గరకు నడిచాము. అప్పటికే వాళ్ళను చూడ్డానికి వందల మంది మా కాలనీ ఆడాళ్ళు గుమిగూడిపోయారు.

"ముందు వాళ్ళను బట్టలు కట్టుకోమని చెప్పండి" అన్నాం రాజానందంతో.

"ముందు మీరంతా బట్టలు కట్టుకోవాలి మాలాగా! శరీరం అంతా బయటకు కనబడటం మీ రాతియుగం పద్ధతి!" చెప్పాడు రాజానందం వాళ్ళతో.

వాళ్ళు మా బట్టలవేపు చూశారు కుతూహలంగా.

నిజానికి అది వేసవి కావటం వల్ల వేడి భరించలేక సగంమంది మగాళ్ళం షర్టులు, బనీన్లు కూడా లేకుండా కేవలం లుంగీలతో ఉన్నాం. అదే వాళ్ళమొఖంలో ప్రశ్నగా కనిపించింది.

“మా మాగాళ్ళ సంగతివేరు! వేసవి వేడివల్ల ఇప్పుడు షర్టులు వేసుకోలేదు. అని సర్ది చెప్పాడు రాజానందం.

“మరి వాళ్ళో?” అంటూ మా కాలనీ ఆడాళ్ళవేపు చూశాడు బిక్షాద్వీప్ నాయకుడు. మేమంతా కూడా వెనక్కు తిరిగి ఆడాళ్ళవేపు చూశాము. దాంతో మా అందరి మొఖాలు వాడిపోయినాయ్. మేము ఈ మధ్య సరిగ్గా గమనించటం లేదుగానీ కాలనీలో స్త్రీలు, యువతులు చాలామంది మిడ్డీస్ వేస్తున్నారు. అంచేత సగం వళ్ళుకనబడుతూనే ఉంది. చీరలు కట్టిన వాళ్ళు సరేసరి. జాకెట్‌కి చేతుల్లేవు. పైగాసన్న పట్టిలాంటి వెడల్పుతో మాత్రమే శరీరాన్ని చుట్టేసుకుని ఉంది. ఇక చీరలు చూద్దామా నడుముకి బాగా కిందుగా కట్టారు.

అంటే మా అందరికీ ఇంచుమించుగా మూడొంతుల వళ్ళు కనబడుతూనే ఉంది.

మా పరిస్థితిలా ఉండగా అప్పుడే కొంతమంది కాయకష్టం చేసుకునే కూలీలు కేవలం మొలకోచిన్నగుడ్డ చుట్టుకుని మా కాలనీ పక్కనుంచే వెళ్ళటం కనిపించింది.

“అరుగో- వాళ్ళు కూడా అచ్చం మాలాగే ఉన్నారు కదా?” అడిగారు ఆదిమానవులు.

“అదివేరు లెండి- ఇంచు మించు మేమూ మీలాగే ఉన్నాం. కానీ కట్టుకోడానికి బట్టకొనలేక అలా ఉన్నాం. బట్టల ఖరీదు మరీ ఎక్కువ కదా!” అనేసి ఇంక లాభంలేదని టాపిక్ మార్చేశాం.

మధ్యాహ్నం వాళ్ళకోసం మేమంతా కొన్ని కూరగాయలు కలెక్షన్ చేసి వండుకోడానికి ఇచ్చాము- అయితే వాళ్ళు పచ్చివే తినటం చూసి ఆశ్చర్యపోయాము.

“అలా పచ్చివి తినకూడదు! వండుకుని తినాలి మాలాగా!” అన్నాడు రాజానందం.

“వండుకోవడమంటే ఏమిటి? ఎలా ఉంటుందది” అడిగారు వాళ్ళు వెంటనే వాళ్ళందరినీ రంగారెడ్డి ఇంటికి తీసుకెళ్ళాం.

“మా ఆవిడ ఇప్పుడు కూరలు వండుతూంటుంది! చూసి నేర్చుకోండి” అంటూ కిచెన్‌లో తీసుకెళ్ళాడతను.

అక్కడి దృశ్యం చూసేసరికి అందరికీ మతిపోయింది.

రంగారెడ్డి భార్య, వాళ్ళ పిల్లలు డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని పచ్చి కూరగాయలు తింటున్నారు.

భిక్షాద్వీప్ వాళ్ళు ప్రశ్నార్థకంగా మా వేపు చూశారు.

“మీరూ మాలాగే పచ్చివి తింటున్నారుగా?” అడిగాడతను వాళ్ళబాషలో.

"నిజమేగానీ ఎప్పుడూ ఇలా తినము. గాస్ అయిపోయినప్పుడల్లా- మళ్ళీగాస్ వచ్చేవరకూ- అంటే సంవత్సరానికి ఆరునెలలు పచ్చివి తింటాము" అని జవాబు చెప్పి ఎందుకయినా మంచిదని టాపిక్ మార్చేశాము.

"అన్నట్లు మీరంతా చాలా దుర్వాసన కొడుతున్నారు. ఎన్నాళ్ళకోసారి స్నానం చేస్తున్నారు?" అడిగాడు రాజానందం వాళ్ళను.

"ప్రతి అమావాస్యకూ, పౌర్ణానికి చేస్తాం" గర్వంగా చెప్పాడు వాళ్ళ నాయకుడు. అందరం ఘోల్లున నవ్వాము.

మరీ ఇంతదారుణంగా ఉంటారనుకోలేదు ఆదిమానవులంటే.

"ఛీ! ఛీ! అది చాలా చెడ్డ అలవాటు. ప్రతిరోజూ స్నానం చేయాలి వీలయితే రెండుపూటలా చేయాలి. అప్పుడే మురికి, సూక్ష్మ జీవులూ అన్నీ పోతాయ్! మమ్మల్ని చూడు! ఎంతనీట్‌గా నిగనిగలాడుతున్నామో-"

వాళ్ళు మావేపు పరీక్షగా చూస్తోంటే అనుమానం వచ్చి మావంక మేము చూసుకున్నాం. అందరివంటిమీద నల్లగా చారలుకట్టి ఉంది మట్టి. దగ్గరకొచ్చి కొంతమట్టిని కిందకు రాల్చారు వాళ్ళు. ముఖ్యంగా యాదగిరి, జనార్ధన్‌ల వంటి మీద పావుకిలో మట్టిరాలింది.

"మీరెన్నాళ్ళకోసారి చేస్తారు స్నానం?" అడిగారు వాళ్ళు హఠాత్తుగా ముక్కులు మూసుకుంటూ.

"రోజూ రెండుసార్లు' అనబోయి ఆగిపోయాన్నేను ఎందుకంటే మా కాలనీలో అందరం వారం రోజులపాటు నీళ్ళు దాచుకుని వారానికో రోజుస్నానం చేస్తున్నాం ప్రస్తుతం."

మరికొన్ని చోట్ల నీళ్ళ సమస్యవల్ల పదిహేను, ఇరవై రోజులకొకసారి స్నానం చేస్తున్నారు.

"చెప్పరేం? మీరెన్నిసార్లు చేస్తున్నారు రోజూ?" అడిగారు వాళ్ళు. మేమెవ్వరం సమాధానం చెప్పకుండా టాపిక్ మార్చేశాము.

ఈలోగా వాళ్ళల్లో ఒకడు పెళ్ళాన్ని పట్టుకుని బడితెతో చావబాదటం మొదలుపెట్టాడు.

వాడిపెళ్ళాం భోరున ఏడుస్తోంది. అందరం పరుగుతో వెళ్ళి వాడు కొట్టకుండా పట్టుకున్నాం.

"ఏమిటి? ఎందుకొడుతున్నావ్?" అడిగాడు రాజానందం వాడిని.

వాడేదో అయిదు నిమిషాలపాటు చెప్పాడు రాజానందంతో.

"ఆ దూరంగా కనిపించే కొండల దగ్గర వీళ్ళ బాచ్ ఇంకొంతమందినీ ఉంచిందట ప్రభుత్వం. వాళ్ళళ్ళో వీడి పెళ్ళాం తాలూకు తల్లితండ్రులున్నారట. వాళ్ళు పెళ్ళిలో వాడికిస్తామన్న రెండు మేకలు ఇవ్వలేదట అందుకని దాన్ని చావగొడుతున్నాడు-

మా అందరికీ వళ్లు మండిపోయింది.

"నీకేం బుద్ధుందా లేదా! వాటికోసం పెళ్ళాన్ని చావగొడతావా? అసలు ఆడదాన్ని కొట్టడం అనాగరికం! మా దగ్గర చూడు– మా ఆడాళ్ళూ మేమూ సమానంగా ఉంటాం అన్ని రంగాల్లోనూ" అన్నాం గర్వంగా మాతోపాటు వచ్చిన మాకాలనీ స్త్రీలను చూపుతూ.

వాళ్ళ నాయకుడు చాలాసేపు ఆలోచించాడు.

"నిజమే! మీరు చాలా అభివృద్ధి సాధించారు. స్త్రీకి గౌరవం ఇచ్చే విషయములో మా వాళ్ళందరూ కూడా మీలాగా ఆడాళ్ళను బాధలు పెట్టకుండా కొత్తగా కట్టడి చేస్తాను"

అందరికీ ఆ మాట వింటునే ఆనందం కలిగింది. ఈ ఒక్క విషయంలోనయినా వాళ్ళకంటే మేం ముందు ఉన్నందుకు గర్వపడ్డాము.

కానీ మా గర్వం రెండు నిముషాలన్నా నిలువకముందే మా కాలనీలో ఓ ఇంటిలో నుంచి పెద్దగా పొగలు బయటకు రాసాగానయ్. దాని వెనుకే కేకలు, ఏడుపులు–

అందరం ఆ ఇంటి దగ్గరకు పరుగెత్తాం. కొత్తగా పెళ్ళయిన అమ్మాయికట్నం తేలేదని ఆమె భర్త ఆమె మీద కిర్సనాయిలు పోసి చంపేశాడు.

"ఏమిటి? ఏం జరిగింది?" అడిగాడు భిక్షాద్వీప్ నాయకుడు.

జరిగినదంతా చెప్పాడు రాజానందం. ఆ నాయకుడి కళ్ళల్లో ఆశ్చర్యం కనిపించింది. "అదేమిటి? మీ ఆధునిక సమాజంలో భార్యను ఏకంగా ఛంపేస్తారా?" అనడిగాడు.

మేము మాట్లాడలేదు. "మాకు అర్జంటు పనుంది" అంటూ అక్కడ నుంచి జారుకున్నాం.

ఆ రాత్రి ఆదిమానవులందరూ ఆడా, మగా కలిసి కొమ్ముబూర ఊదుతూ చెట్ల ఆకులు రెండుమాత్రం నడుముకి కట్టుకుని అర్ధనగ్నంగా ఎగురుతూ పిచ్చి పిచ్చిగా కేకలు వేస్తున్నారు.

అలా ఎందుకు చేస్తున్నారో అర్థంగాక అందరం వాళ్ళ దగ్గరకు చేరుకున్నాం.

వాళ్ళ నాయకుడితో మాట్లాడాక రాజానందం చెప్పాడు.

"వాళ్ళకు అలా ఓ పద్ధతీపాడు లేకుండా ఎగరటమే వినోద కార్యక్రమం ఆట."

"మీ ఆదిమానవులు ఇలాంటి పిచ్చిపిచ్చి చేష్టలు మానేయాలి. మమ్మల్ని చూడండి! మేము మీలాగా అర్ధనగ్నంగా ఎగురుతున్నామా?" అడిగాడు రాజానందం వాళ్ళతో.

"లేదు" అన్నాడు వాళ్ళ నాయకుడు.

"మీరు అలా ఎగరటం రాతియుగం నాటి సంస్కృతి. అధునిక యుగంలో అలా ఎవరూ చేయరు!"

"మరి మీకు వినోదం కావాలంటే ఎలా?" అనుమానంగా అడిగాడు.

"మాకు ఎంతోకాలం నుంచీ ఎందరో మహానుభావులు కృషిచేసి అభివృద్ధి పరచిన సంగీతం సాహిత్యం, నృత్యంలాంటి కళలున్నాయి. మీరు కూడా వాటిని నేర్చుకోవాలి."

"ఎలా ఉంటాయని?"

"ఇప్పుడు మీ వాళ్ళు ఎగురుతూ పాడుతోన్న ఓ పదం విన్నాను. దానర్థం చాలా పెద్దబూతు మా సమాజంలో! అలాంటి బూతులు మేము మాట్లాడం! మా భాష చాలా సాఫిస్టికేటెడ్‌గా ఉంటుంది– కావాలంటే మా వినోద కార్యక్రమాల గురించి తెలియజేస్తాం! రండి"

అంటూ వాళ్ళందరినీ వెంబడి తీసుకెళ్ళి రంగారెడ్డి ఇంట్లో టి.వి.ఛానెల్ ఆన్‌చేసి ప్రోగ్రాం చూపించాము.

అప్పుడే కొత్తగా రిలీజయిన అద్దం తిరిగిన తెలుగుగడ్డ లోపాట ప్రారంభమయింది. హీరో హీరోయిన్ ఇంకా బోలెడు మంది అమ్మాయిలు సగం బట్టకట్టుకుని అది మానవులకంటే అన్యాయంగా అధ్వాన్నంగా పిచ్చిగంతులేస్తూ, అంతకంటే బూతుగా వికారంగా పాడసాగారు. భిక్షాద్వీప్ వాళ్ళందరూ అదిచూసి ఆనందంతో గంతులేయసాగారు.

"అచ్చం మా వినోద నృత్యంలాగానే ఉంది కదా మీది కూడా" అని వాళ్ళు అంటూంటే ఇన్సల్ట్ భరించలేక టి.వి. ఆఫ్ చేసేశాం!

సరిగ్గా అప్పుడే కాలనీ బయట నుంచి ఎవరో 'పాము పాము' అంటూ కేకలేయసాగారు. అందరం బయటకు పరుగెత్తాము. బయట చంద్రకాంత్ ఇంటిముందు నుంచి సరసరా పాకుతోందో పాము. దాన్ని చూస్తూనే భిక్షాద్వీప్ వాళ్ళు ఒక్కదూకు దూకి పట్టుకుని నేలకేసి గట్టిగా ఓసారి కొట్టి తలో ముక్క తుంపుకుని తినేయసాగారు.

మా కందరికీ భయంతో వళ్ళు గగ్గుర్పొడించింది. డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి అదృశ్యం చూళ్ళేక స్పృహతప్పింది.

రాజానందం వాళ్ళమీద మండిపడ్డాడు "పిచ్చి వెధవల్లారా! పాముని తింటే ఛస్తారు" అన్నాడు వాళ్ళతో.

"ఎందుకు ఛస్తాం?"

"అందులో విషం ఉంటుంది"

వాళ్ళు ఘొల్లున నవ్వారు 'మరి మేము ఎప్పటినుంచో వాటిని తింటున్నాం కదా!

"అదృష్టం కొద్దీ బ్రతికిపోయారు. ఇంక అలాంటివి తినకండి!"

"మరేం తినాలి?"

"మాలాగా అన్నం కూరలు తినాలి! అవి తింటే ఎలాంటి ప్రమాదం ఉండదు–"

రాజానందం చెప్తూండగానే మా బగరా బైగన్ వెంకట్రావ్ హఠాత్తుగా మా మధ్యే వాంతి చేసుకోవటం ప్రారంభించాడు. అప్పటికప్పుడే కాళ్ళూ, చేతులూ చల్లబడి పోవటంతో డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాం.

"హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి. కల్తీ ఆహారం తిన్నాడు" అన్నాడు డాక్టరు. అప్పటికప్పుడే వెంకట్రావ్‌ని హాస్పిటల్‌కి తీసుకెళ్ళిపోయారు.

"ఏం జరిగింది?" అడిగాడు ఆదిమానవుల నాయకుడు.

"తిన్న భోజనం వల్ల- ప్రాణం మీదకొచ్చింది"

"అదేమిటి మీరు తినే భోజనం మంచిదన్నారుగా"

"అన్నాననుకోండి! కానీ ఎప్పుడు ప్రాణం మీదకొస్తుందో ఎవరికీ తెలీదు. ఎప్పుడు, ఎవడు- ఆ భోజనంలో కల్తీ చేస్తాడో కూడా తెలీదు-"

"అయితే మా పాములే మంచివి కదా!"

మేమింక మాట్లాళ్ళేదు.

తెల్లారాక బయటికొచ్చి చూసేసరికి భిక్షాద్వీప్ వాళ్ళాంతా నెత్తిన పెద్దపెద్ద బండ రాళ్ళు పెట్టుకుని అవి కిందపడిపోకుండా తాళ్ళతో కట్టుకుని తిరగసాగారు.

వాళ్ళను వెంటనే పిలిపించాము సంగతేమిటో కనుక్కోటానికి.

"మా నాయకుడు పెట్టుకోమని ఆజ్ఞాపించాడు అందుకని పెట్టుకున్నాం" చెప్పాడొకడు.

"మీకేం బుద్ధుందా లేదా? మీ నాయకుడేం చెపితే అది గొర్రెల్లా చేసేయటమేనా? రేప్పొద్దున్నవాడు మిమ్మల్ని గంగలో దూకమంటే దూకేస్తారా?" అడిగాడు రాజానందం.

"మా నాయకుడు చెప్పినట్లు చేయకపోతే చాలా పెద్దశిక్ష వేస్తారు మాకు" భయంగా జవాబిచ్చాడు.

రాజానందంతో పాటు మేమూ ఆ నాయకుడి దగ్గరకు నడిచాము. ఆ నాయకుడు హాయిగా తన గుహలో పడుకుని ఈతసారా తాగుతున్నాడు.

రాజాచంద్ర ప్రశ్న వింటూనే గట్టిగా నవ్వాడతను.

"మీకామాత్రం తెలీదా? పైగా పెద్ద ఆధునిక మానవుడంటారు. పైన గద్దలు తిరుగుతున్నాయ్ కనబడుతోందా?"

అందరం ఆకాశంవేపు చూశాము. గద్దలు కొన్ని తిరుగుతన్నాయి. "అయితే ఏమిటి?"

"ఆ గద్దలు మన నెత్తిమీద తంతే ప్రమాదం కదా! అందుకనే బండరాళ్ళు నెత్తిన పెట్టుకోమని వాళ్ళకు ఆజ్ఞాపించాను. ఇప్పుడు గద్దలు తన్నినా రాయికి తగులుతుంది గానీ మా వాళ్ళకు దెబ్బతగలదు-"

"నీకేం మతుందా లేదా? అయినా గద్దలెందుకు తంతాయ్?"

"చాలా సంవత్సరాల క్రితం ఓ సారి తన్నింది-"

"అందుకని ఎప్పుడూ రాయి నెత్తిన పెట్టుకుంటారా?"

అందరం ఘొల్లున నవ్వాము. నాయకుడి ముఖం చిన్నబోయింది మేము వెనక్కు తిరిగి ఇంటికి చేరుకుని వెహికల్స్ తీసుకుని ఆఫీస్‌కి బయల్దేరాము. హఠాత్తుగా భిక్షాద్వీప్ వాళ్ళు మమ్మల్ని చుట్టుముట్టేశారు. వాళ్ళ నాయకుడు కోపంగా మా దగ్గరకొచ్చాడు.

"ఇందాక బండరాళ్ళు మేము నెత్తినకట్టుకున్నామని హేళనచేశారుగా! మరి మీరు చేస్తోందేమిటి?" మేము ఆశ్చర్యంగా నెత్తితడుముకున్నాం. తీరా చూస్తే అవి మా హెల్మెట్లు!

"ఇవి బండరాళ్ళుకాదు హెల్మెట్లు–" అన్నాడు రాజానందం.

"ఏదయితేనేం? ఇదెందుకు మోస్తున్నారు మీరు?"

"మా పోలీస్ కమీషనర్ పెట్టుకోమన్నాడు!"

"ఎందుకు?"

అందరం మొఖాలు చూసుకున్నాం. ఎందుకు హెల్మెట్ పెట్టుకోమన్నారో నిజంగానే మాకే తెలీదు. "ఎప్పుడో ఓ సారి యాక్సిడెంట్ అవుతుందట! అందుకని పెట్టుకోమన్నారు–"

ఆదిమానవులంతా ఘొల్లున నవ్వారు.

"ఎప్పుడో ఏదో అవుతుందని జీవితమంతా దీన్ని మోస్తూ తిరుగుతారా?" అన్నారు– దెబ్బకు దెబ్బ కొడుతూ వాళ్ళు. మేము సిగ్గుపడి జారుకున్నాం అక్కడినుంచి. ఆ సాయంత్రం ఆఫీస్ నుంచి వచ్చేప్పటికి భిక్షాద్వీప్ వాళ్ళందరూ ఓ ముసలావిడ చుట్టూమూగి ఉన్నారు. సంగతేమిటో కనుక్కుందామని వెళ్ళాం.

"ఈ ముసలాడు బండరాయి బరువు వల్లదాన్ని మీదేసుకుని కిందపడ్డాడు. బాగారక్తం అదీపోయింది. వీళ్ళ ఆచారం ప్రకారం జబ్బువచ్చినవాడిని చావకముందే పాతిపెట్టేస్తారట–".

అందరం వాళ్ల మీద విరుచుకుపడ్డాం " అది అమానుషం" అంటూ అరచాం.

"మీరేం చేస్తారు జబ్బువస్తే?" అడిగాడు వాళ్ళ నాయకుడు ఆశ్చర్యంగా.

"హాస్పిటల్ చేర్పించి జబ్బు తగ్గిస్తాము"

అతను బుర్రగోకున్నాడు "సరే మేమూ మీ పద్ధతి అవలంబిస్తాం" అన్నాడు. అప్పుడే గోపాల్రావ్ ఆటోలో వాళ్ళ నాన్నగారిని తీసుకొచ్చాడు. ఆ ఇంటి వాళ్ళంతా పెద్దగా ఏడుస్తూ ఆటో చుట్టూ మూగారు. మేము కూడా షాక్‌తిన్నాము. గోపాల్రావ్ వాళ్ళ నాన్నగారిని ప్రభుత్వహాస్పిటల్లో చేర్చాడు. కానీ వాళ్ళ నాన్నగారు ప్రాణాలతో తిరిగి వచ్చారిప్పుడు.

"బాస్టర్డ్స్– మా నాన్న చావకముందే చచ్చిపోయాడని మార్చురీలో పడేశారు. తీరా శవాన్ని తెద్దామని వెళ్ళేసరికి పరుగుతో బయటి కొచ్చాడాయన–" చెప్పాడు గోపాల్రావ్.

ఆ విషయం ఆదిమానవులతో చెప్పటం మాకిష్టం లేకపోయింది. ఎందుకంటే వాళ్ళు పద్ధతులే మన ఆధునిక సమాజం కూడా ఆచరిస్తోందని ఋజువయింది కాబట్టి! ఆ రాత్రి హఠాత్తుగా మళ్ళీ కేకలు వినిపించినయ్. బయటకు పరుగెత్తి చూసేసరికి కొండల్లో

ఉన్న ఆదిమానవులకీ, మా కాలనీలో ఉన్న ఆదిమానవులకూ యుద్ధం జరుగుతోంది యుద్ధంలో ఓ పాతికమంది చనిపోయాక అవతలివాళ్ళు మళ్ళీ కొండల్లోకి పారిపోయారు.

"ఎందుకు వాళ్ళతో యుద్ధం చేశారు? వాళ్ళూ మీలాగే ఆదిమానవులే కదా?" అడిగాడు రాజానందం వాళ్ళ నాయకుడిని.

"వాళ్ళకూ మాకు శత్రుత్వం ఏమీలేదుగానీ ఎంతో కాలం నుంచీ అప్పుడప్పుడూ యుద్ధంచేసి ఎవరు ఎక్కువో తేల్చుకుంటూంటాం" చెప్పాడతను.

"చూశారా మీరెంత మూర్ఖత్వంలో మగ్గిపోతున్నారక్క! ఊరికే పోట్లాడుకుని కొట్టుకుని చనిపోతున్నారు. మమ్మల్ని చూడండి! ఎంత సభ్యతతో కలిసిమెలసి జీవితం గడుపుతున్నామో"

భిక్షాద్వీప్ నాయకుడు కాసేపు ఆలోచించాడు.

"నిజమే మేమూ మీలాగా మరిపోతాం! ఇకనుంచీ యుద్ధాలు రాకుండా చూసుకుంటాం"

అతనలా చెపుతూండగానే బయట పోలీస్ వాన్‌లో నుంచి హెచ్చరిక వినిపించసాగింది.

"నగరంలో రెండు వర్గాల మధ్య జరిగినమత కల్లోలాలవల్ల నిరవధికంగా కర్ఫ్యూ విధించడమయినది. వీధుల్లో ఎవరయినా కనిపించినట్లయితే కాల్చివేయడం జరుగుతుంది–"

"ఏమిటి? ఏం చెపుతున్నారు?" అడిగాడు భిక్షాద్వీప్ నాయకుడు కుతూహలంగా.

మేము వారికేం సమాధానం చెప్పలేదు. కర్ఫ్యూ ముగిశాక కూడా వాళ్ళకి కనిపించటానికి మొఖం చెల్లలేదు మాకు.

